ADVERTISING
నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

విజయవాడ ఆదివారం 13-09-2026 సంపుటి: 02 సంచిక : 74 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Sunday, 13-09-2026 Volume :02 Issue: 74 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777




## ఘనంగా ప్రారంభమైన
# బ్రిక్స్ సమావేశాలు

- బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం
- డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- పహల్గామ్ దాడిని ఖండిస్తూ బ్రిక్స్ ప్రకటన
- ప్రధాని నరేంద్ర మోదీ దౌత్య విజయం
- భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు
- పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం

02 'ఢిల్లీ డిక్లరేషన్' కు ఆమోదముద్ర

న్యూఢిల్లీలో భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ సదస్సు ప్రపంచ వేదికపై భారత్ ప్రాధాన్యాన్ని మరోసారి చాటింది. శాంతి, భద్రత, ఆర్థిక సహకారం, అంతర్జాతీయ వాణిజ్యం, అభివృద్ధి వంటి కీలక అంశాలపై సభ్య దేశాలు విస్తృతంగా చర్చించి న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం, ప్రపంచ ఆర్థిక సంస్థల్లో సంస్కరణలు చేపట్టడం, సభ్య దేశాల మధ్య వాణిజ్యం--పెట్టుబడులు--సాంకేతిక సహకారాన్ని విస్తరించడంపై నిర్ణయాలు తీసుకున్నాయి. ప్రపంచ ఘర్షణలకు శాంతియుత పరిష్కారాలు, బహుపాక్షిక సహకారం, పరస్పర గౌరవం అవసరమని స్పష్టం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ బ్రిక్స్ దేశాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



## ఏపీలో నేడు
# భారీ వర్షాలు

- ఉత్తరాంధ్ర తీరంలో అల్పపీడన ప్రభావం
- ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు
- శ్రీకాకుళానికి భారీ వర్ష సూచన
- ఎనిమిది జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు
- దక్షిణ కోస్తాలోనూ వర్షాలు.. బలమైన గాలులు
- ఉత్తరాంధ్ర తీరం వెంబడి 60 కి.మీ. వేగంతో గాలులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న హోంమంత్రి అనిత
- చెట్లు, హోర్డింగ్‌ల కింద ఉండొద్దని హెచ్చరిక
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని స్పష్టీకరణ
- క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అప్రమత్తం

**అమరావతి**

దక్షిణ ఒడిశా – ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో నెలకొన్న అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీని ఫలితంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రభాకర్ జైన్ తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ హై అలర్ట్ ప్రకటించింది. విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తరాంధ్ర తీరం వెంబడే గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో, దక్షిణ కోస్తాలో

-మిగతా 2 లో

## 'హెల్దీ.. వెల్దీ.. హ్యాపీ'
# ఏపీ లక్ష్యం

### వైద్యారోగ్య రంగంలో ఏపీని అగ్రగామిగా నిలబెడతాం

- 'సంజీవని'తో వైద్య రంగంలో గేమ్‌చేంజ్
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు
- ప్రజల హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
- అమరావతికి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొస్తాం
- దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలోనే
- క్వాంటం బయాల్యాబ్స్‌కు జాతీయ గుర్తింపు కోరుతున్నాం
- ఏఐలో యువతకు శిక్షణ.. భవిష్యత్ అవసరాలకు నిపుణుల తయారీ
- ఫార్మా, మెడ్‌టెక్ రంగాల్లో ఏపీని ముందుకు తీసుకెళ్తాం
- 'కిచెన్ ఫార్మసీ'ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి
- ఆహారమే ఔషధంగా భావించి జీవనశైలి మార్చుకోవాలి
- కేంద్ర సహకారం.. రాష్ట్ర సంకల్పంతో ఏపీ నంబర్-1
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు


**అమరావతి**

వైద్యారోగ్య రంగంలో ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలో క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కళా వేదికలో వైద్య విద్యార్థులు, అధికారులు, ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. సీఎం చంద్రబాబు వేదికపైకి రాగానే వైద్య విద్యార్థులు పెద్దఎత్తున హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. ఆయన ప్రసంగం కొనసాగినంతసేపూ అంబేద్కర్ కళా వేదిక చప్పట్లతో మ్రోతమోగింది. వైద్యారోగ్య రంగానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న

-మిగతా 2 లో





# భారత్, చైనా కలిసి నడవాలి

- పరస్పరం సహకరించుకోవాలి
- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెల్లడి
- నిర్మాణాత్మక చర్చలకు మేం సిద్ధం
- ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక భేటీ
- సరిహద్దు వివాదంపై ఇరువురు చర్చ
- ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ పర్యటన

02




## జొమాటోలో
# మరో కొత్త ఛార్జీ!

- క్యాష్ ఆన్ డెలివరీపై అదనంగా రూ.5 వసూలు
- బిల్ సమ్మరీలో ప్రత్యేకంగా కనిపిస్తున్న చార్జీ
- ఆన్‌లైన్ పేమెంట్లకు మాత్రం అదనపు ఫీజు లేదు
- డిజిటల్ చెల్లింపుల వైపు కస్టమర్లను మళ్లించే యత్నం
- లాభాల పెంపే లక్ష్యంగా కొత్త ఛార్జీల విధానం
- ఇటీవలే ప్లాట్‌ఫామ్ ఫీజు రూ.12.50 నుంచి రూ.14.90కి పెంపు
- ఫుడ్ డెలివరీ రంగంలో పెరిగిన పోటీ ప్రభావం

02

## ఆధ్యాత్మిక బాటలో
# పవన్ కళ్యాణ్

### కేరళలో ప్రముఖ ఆలయాలను దర్శించిన జనసేనాని

- గురువాయూరప్పకు శంఖాభిషేకం
- స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ
- మామ్మియూర్ మహాదేవుని ఆలయంలో ప్రత్యేక అర్చనలు
- చెట్టికులంగర భగవతి అమ్మవారికి పుష్పాంజలి సేవ
- శరన్నవరాత్రుల్లో భక్తుల అన్నదానానికి విరాళం


**అమరావతి,**


వైద్యం నిమిత్తం కేరళ వెళ్లిన ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అక్కడి ప్రముఖ ఆలయాలను దర్శించారు. వేకువ జామున గురువాయూర్ శ్రీకృష్ణస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తైలాభిషేకం, శంఖాభిషేకం, వాకచార్తు సేవల్లో పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం మామ్మియూర్ మహాదేవుని ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. సాయంత్రం అలప్పుజ జిల్లాలోని చారిత్రక చెట్టికులంగర భగవతి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి పుష్పాంజలి సేవలో పాల్గొన్నారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల అన్నదానానికి అయ్యే మొత్తాన్ని దేవస్థానం బోర్డుకు విరాళంగా అందజేశారు.

**వేకువజామున గురువాయూర్ దర్శనం**

తెల్లవారుజామున 3 గంటలకు త్రిసూర్ జిల్లాలోని గురువాయూర్ ఆలయానికి జనసేనాని చేరుకున్నారు. ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దక్షిణ ముఖద్వారం

-మిగతా 2 లో





02

## సౌదీ పైప్‌లైన్‌పై
# ఇరాక్ డ్రోన్ దాడి

- 1,200 కి.మీ. కీలక పైప్‌లైన్ తాత్కాలికంగా మూసివేత
- దాడిలో పలువురికి గాయాలు.. భారీగా ఆస్తినష్టం
- ఇరాక్ నుంచి దాడి జరిగినట్లు ధ్రువీకరణ
- సైనిక కమాండర్‌పై వేటు.. ప్రధాని విచారణకు ఆదేశం
- భద్రతా కారణాలతో సరిహద్దు క్రాసింగులు మూసివేత
- ఇరాన్ మద్దతు మిలీషియాలపై సౌదీ తీవ్ర ఆరోపణలు
- హార్ముజ్ సంక్షోభంతో పైప్‌లైన్‌కు పెరిగిన ప్రాధాన్యం
- తూర్పు--పడమర పైప్‌లైన్ ద్వారా చమురు తరలింపు
- ప్రతీకార దాడులకు దిగబోమన్న సౌదీ అరేబియా
- సార్వభౌమత్వం,భద్రత రక్షణకు చర్యలు తప్పవని స్పష్టీకరణ



02

## కాంగ్రెస్ పదవులకు
# రావత్ రాజీనామా

- ఈడీ సోదాల వేళ రావత్ సంచలన నిర్ణయం
- పార్టీకి ఇబ్బంది రాకూడదంటూ రాజీనామా
- పీఏ చందన్ సింగ్ నివాసాల్లో ఈడీ తనిఖీలు
- రూ.32 లక్షల నగదు.. 200 గ్రాముల బంగారం గుర్తింపు



## పౌల్ట్రీ రైతులకు
# భారీ ప్యాకేజీ

- రూ.657 కోట్లతో పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ
- ఉత్పత్తి వ్యయం తగ్గించడమే ప్రధాన లక్ష్యం
- కోళ్ల ఫారాలు, హేచరీల రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ
- కొత్త ఈసీ షెడ్లకు రూ.25 లక్షల వరకు 25 శాతం సబ్సిడీ
- పాత షెడ్ల ఆధునీకరణకు రూ.20 లక్షల వరకు రాయితీ
- మహిళా సంఘాలతో ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లు
- విజయవాడ, విశాఖ, చిత్తూరులో ప్రాసెసింగ్ ప్లాంట్లు
- ఫీడ్ వ్యయం తగ్గించేందుకు నూక బియ్యం సరఫరాకు హామీ
- అచ్చెన్నాయుడిని కలిసిన పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు

**అమరావతి**

రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు పూర్తి స్థాయి అండగా నిలిచేందుకు 'ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026–29'కు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసిన సందర్భంగా మాట్లాడిన మంత్రి... ఈ రంగం అభివృద్ధికి రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించామని వెల్లడించారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా కోళ్ల ఫారాలు, హేచరీల రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ, లో–టెన్షన్ ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు రూ.4.75 టారిఫ్

-మిగతా 2 లో

# జొమాటోలో మరో కొత్త ఛార్జీ!

## ఆన్ డెలివరీలపై రూ 5 అదనపు చార్జీలు




న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో వినియోగదారులకు మరో షాక్ ఇచ్చింది. ఒక్కో క్యాష్ ఆన్ డెలివరీపై రూ.5 అదనపు చార్జీల వసూలు ప్రారంభించింది. జొమాటో బిల్ సమ్మరీలో ఈ చార్జీలు కనిపిస్తున్నాయి. అయితే ఆన్‌లైన్ పేమెంట్లు చేసే వారికి ఈ ఛార్జీలు వర్తించవని సంస్థ చెబుతున్నది.లాభాలను పెంచుకోవడం, కస్టమర్లను డిజిటల్ పేమెంట్ల వైపు ప్రోత్సహించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ చెబుతున్నది. ఇటీవల ప్లాట్‌ఫామ్ ఫీజును రూ.12.50 నుంచి రూ.14.90కి పెంచిన సంస్థ ఇప్పుడు మరో ఫీజును విధిస్తున్నది. ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ తీవ్రం కావడంతో లాభాలను మెరుగుపరుచుకునేందుకే జొమాటో ఇలా చార్జీలను పెంచుతున్నట్టు సమాచారం.

# కాంగ్రెస్ పదవులకు రావత్ రాజీనామా



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ మాజీ సీఎం హరీశ్ రావత్ కాంగ్రెస్‌లోని అన్ని పదవులకు రాజీనామా చేశారు. తన పీఏ చందన్ సింగ్ జీనా నివాసాల్లో శుక్రవారం ఈడీ దాడులు జరగ్గా.. శనివారం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. 2016లో హరీశ్ రావత్ సీఎంగా ఉన్నప్పుడు చందన్ సింగ్ ఆయనకు ఓఎస్డీగా పనిచేశారు. ఆ ఏడాదిలో నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాల్లో మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా చందన్ సింగ్ ఇల్లుతో పాటు పలు చోట్ల ఈడీ సోదాలు జరిగాయి. ఈ దాడుల్లో రూ.32 లక్షల లెక్కలు చూపని నగదు, 200 గ్రాముల బంగారం, లగ్జరీ వాచ్‌లు అధికారులు గుర్తించారు. చందన్ సింగ్ కుటుంబీకుల బ్యాంకు ఖాతాల్లో రూ.50 లక్షల దాకా నగదును సీజ్ చేశారు. ఈ దాడుల నేపథ్యంలో హరీశ్ రావత్ మాట్లాడుతూ.. తన వల్ల కాంగ్రెస్‌కు ఇబ్బంది రావొద్దనే పదవులకు రాజీనామా చేశానన్నారు. నియామక పరీక్షల్లో ఆరోపణలు నిజమని తేలితే తనకు కూడా సిగ్గుచేటేనని పేర్కొన్నారు.

# ఏపీలో నేడు భారీ వర్షాలు

మొదటి తరువాయి

40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రజలకు కీలక సూచనలు చేశారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు కురిసే సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగ్‌ల సమీపంలో ఉండరాదని కోరారు. ముఖ్యంగా మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకూడదని ఆమె స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

# ఆధ్యాత్మిక బాటలో పవన్ కళ్యాణ్

మొదటి తరువాయి



నుంచి ఆలయంలోకి ప్రవేశించిన ఆయన నిర్మాల్య దర్శనం చేసుకున్నారు. సుమారు 30 నిమిషాలపాటు ఈ విశిష్ట సేవలో పాల్గొన్నారు. ముందురోజు స్వామివారికి నిర్వహించిన అలంకరణతో జరిగే తొలి దర్శనాన్ని నిర్మాల్యదర్శనంగా పిలుస్తారు. గర్భాలయంలోని మూలవిరాట్టుకు నిర్వహించే ప్రత్యేక కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో తిలకించారు. తదుపరి తైలాభిషేకం, శంఖాభిషేకం, వాకచార్తు సేవల్లో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని వినాయకుడు, ఆంజనేయస్వామి, అనంత పద్మనాభస్వామి, భగవతి అమ్మవార్లను దర్శించుకున్నారు.

**చెట్టికులంగర భగవతి అమ్మవారి సేవలో..**

శనివారం సాయంత్రం అలప్పుజ జిల్లా పరిధిలోని చారిత్రక చెట్టికులంగర శ్రీ భగవతి అమ్మవారి ఆలయాన్ని పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు. పుష్పాంజలి సేవలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరోగ్య ప్రదాయినిగా పేరున్న భగవతి అమ్మవారికి పుష్పాంజలి సమర్పిస్తే సర్వదోష నివారణ కోసం చేస్తారని ప్రతీతి. దసరా శరన్నవరాత్రుల తొమ్మిది రోజులు అమ్మవారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు అన్నదానానికి అయ్యే వ్యయం మొత్తాన్ని దేవస్థానం బోర్డుకు పవన్ కళ్యాణ్ విరాళంగా అందజేశారు.

**మామ్మియూర్ మహాదేవుని సేవలో..**

గురువాయూర్ దర్శనం అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీపంలోని మామ్మియూర్ మహాదేవ ఆలయానికి వెళ్లారు. వేకువజామున పరమశివుని పూజలో పాల్గొని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురువాయూర్ శ్రీకృష్ణస్వామి దర్శనం అనంతరం మామ్మియూర్ మహాదేవుని దర్శించుకోవడం సంప్రదాయంగా కొనసాగుతోంది. పురాణ కథనం ప్రకారం గురువాయూర్ శ్రీకృష్ణ ఆలయానికి మామ్మియూర్ మహాదేవ ఆలయంతో ప్రత్యేక అనుబంధం ఉంది. విష్ణుమూర్తి విగ్రహ ప్రతిష్ఠ కోసం రుద్ర తీర్థంలో శివుడు తపస్సు చేసిన స్థలాన్ని ఇచ్చినట్లు స్థలపురాణం చెబుతోంది. దీంతో గురువాయూర్ శ్రీకృష్ణుని దర్శనం అనంతరం మామ్మియూర్ మహాదేవుని దర్శించుకోవడం అనావాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న పవన్ కళ్యాణ్‌కు మలబార్ దేవస్థానం బోర్డు సభ్యులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

# పౌల్ట్రీ రైతులకు భారీ ప్యాకేజీ

మొదటి తరువాయి

క్రమబద్ధీకరణ కల్పించామన్నారు. కొత్త ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ (ఇఇ) పౌల్ట్రీ షెడ్లకు రూ.25 లక్షల వరకు, పాత షెడ్ల ఆధునీకరణకు రూ.20 లక్షల వరకు 25 శాతం క్యాపిటల్ సబ్సిడీ అందించే అవకాశం కల్పించామని తెలిపారు. బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ద్వారా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను స్థాపిస్తామన్నారు. పీపీపీ విధానంలో విజయవాడ, విశాఖపట్నం, చిత్తూరు కేంద్రాలుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్రంతో చర్చించి నూక బియ్యం సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

# ఘనంగా ప్రారంభమైన బ్రిక్స్ సమావేశాలు

- -దిల్లీ డిక్లరేషన్' కు ఆమోదముద్ర
- -బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం
- -డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- -పహల్గామ్ దాడిని ఖండిస్తూ బ్రిక్స్ ప్రకటన
- -ప్రధాని నరేంద్ర మోదీ దౌత్య విజయం
- -భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు
- -పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం



భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ దిల్లీ డిక్లరేషన్ 2026 కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్ కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. భారత్ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి 'బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స్ సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విభేదాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం కీలకంగా మారింది. న్యూ దిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే.. ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదాని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స్ కూటమి దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొనేందుకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. వీటితోపాటు మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స్ దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నేతృత్వంలో ఈ బ్రిక్స్ సదస్సు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించాయి. ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్?, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది.వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది. అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో నిర్ణయాధికారులుగా మహిళల పాత్ర అత్యంత కీలకమని న్యూదిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

# 'హెల్దీ.. వెల్దీ.. హ్యాపీ' ఏపీ లక్ష్యం

మొదటి తరువాయి

సహకారానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే రాష్ట్రంలో ఇలాంటి అభివృద్ధి సాధ్యమవుతోందని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో దేశ వైద్య రంగంలో కేంద్ర ప్రభుత్వం అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని సీఎం అన్నారు. దేశంలో మెడికల్ సీట్ల సంఖ్యను భారీగా పెంచారని, ప్రపంచానికి కోవిడ్ వ్యాక్సిన్ అందించిన ఘనత భారతదేశానికి, ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందని చెప్పారు. మంగళగిరి ఎయిమ్స్ ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు తక్కువ ధరలకు మందులు అందుతున్నాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ అకౌంట్ (అభా) కార్డు ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. వైద్య రంగంలో 'సంజీవని' గేమ్ చేంజర్ గా మారబోతోందని చంద్రబాబు ప్రకటించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్ విధానంతో రాష్ట్ర వైద్యారోగ్య రంగాన్ని ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. జనవరి 1 నుంచి ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేస్తున్నామని తెలిపారు. అమరావతికి ప్రపంచ స్థాయి గుర్తింపు అమరావతిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని చంద్రబాబు అన్నారు. లడఖ్ వంటి ప్రాంతాల్లోనూ అమరావతి గురించి మాట్లాడుకుంటున్నారని చెప్పారు. భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించి చర్చించుకునే పరిస్థితి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలోనే ప్రారంభం కానుందని చంద్రబాబు తెలిపారు. అమరావతి క్వాంటం బయాల్యాబ్స్ ని ఏర్పాటు చేస్తున్నామని, దీనికి జాతీయ గుర్తింపు ఇవ్వాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కోరుతున్నామని చెప్పారు. యువతకు ఏఐలో శిక్షణ ఇచ్చి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ ప్రొఫెషనల్స్ ను తయారు చేస్తున్నామని వెల్లడించారు. ఫార్మా రంగానికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా ఉందని సీఎం పేర్కొన్నారు. మెడ్ టెక్ పార్క్ ద్వారా మెడికల్ ఎక్విప్ మెంట్ ఉత్పత్తికి ప్రోత్సాహం ఇస్తున్నామని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో పాటు సంప్రదాయ ఆరోగ్య విధానాలను కూడా పాటించాలని సూచించారు. 'కిచెన్ ఫార్మసీ' భావనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని.. ఆహారమే ఔషధంగా భావించి ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. యోగ, ప్రాణాయామం, ధ్యానం వంటి వాటిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అభ్యసించాలని సీఎం సూచించారు. యోగాభ్యాసం వల్ల ఎనర్జీ లెవెల్స్ పెరుగుతాయని చెప్పారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటే వచ్చే పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన ప్రగతిని సాధించగలదని ధీమా వ్యక్తం చేశారు. వైద్యారోగ్య రంగంతో పాటు అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీరు అందిస్తున్నామని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తున్నామని తెలిపారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించిన విషయాన్ని గుర్తుచేశారు. కేంద్ర సహకారం.. రాష్ట్ర సంకల్పం.. ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ ను నెంబర్-1 స్థానంలో నిలబెడతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని, రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' దిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

# భారత్, చైనా కలిసి నడవాలి

- -పరస్పరం సహకరించుకోవాలి
- -చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెల్లడి
- -నిర్మాణాత్మక చర్చలకు మేం సిద్ధం
- -ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- -భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక భేటీ
- -సరిహద్దు వివాదంపై ఇరువురు చర్చ
- -ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ పర్యటన



బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు దిల్లీకి వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భారత మండపంలో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ఈ క్రమంలో సరిహద్దు వివాదం, వాణిజ్యం సహా పలు అంశాలపై ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటామని అన్నారు. అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి నడవాలని, అనేక విషయాల్లో పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే, ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలని అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక సంబంధాల దీర్ఘకాలిక అభివృద్ధిని వ్యూహాత్మక కోణంలో ఇరుపక్షాలు దృష్టిలో ఉంచుకోవడంతోనే చైనా-భారత్ సంబంధాలు అభివృద్ధి చెందాయి. చైనా, భారత్‌లు భిన్నమైనవి. అయినప్పటికీ ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి ఇరు దేశాలు పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. సహాయం చేసుకున్నాయి. దిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు హాజరవడం, ప్రధాని మోదీని మరోసారి కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు విజయవంతమైనందుకు మోదీకి నా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గత 12 ఏళ్లలో దిల్లీలో తాను పర్యటించడం ఇది రెండోసారని చైనా అధినేత షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. అదే సమయంలో భారత ప్రధాని మోదీని ఇప్పటివరకు 21 సార్లు కలిశానని గుర్తు చేసుకున్నారు. తత్ఫలితంగా తమ ఇద్దరి మధ్య అనేక ముఖ్యమైన ఏకాభిప్రాయాలు కుదిరాయని స్పష్టం చేశారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో సభ్యులుగా ఇరు దేశాల ఉమ్మడి స్థానాన్ని ఈ సందర్భంగా షీ జిన్‌పింగ్ హైలైట్ చేశారు. మానవాళి ఉమ్మడి భవిష్యత్తు కోసం చైనా, భారత్‌లకు ముఖ్యమైన బాధ్యతలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. చైనా, భారత్‌లు ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ, ఉమ్మడి అభివృద్ధిని సాధించగలవని అన్నారు."భారత్, చైనాలు భిన్నమైన దేశాలు అయినప్పటికీ, ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. చైనా, భారత్ ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలు. అలాగే గ్లోబల్ సౌత్‌లో కీలకమైనవి. మానవాళికి ఉమ్మడి భవిష్యత్తు కోసం ఈ రెండు దేశాలపై కీలకమైన బాధ్యతలు ఉన్నాయి. నాణ్యమైన సహకారాన్ని ఇరుదేశాలు కొనసాగించాలి. మరింత సమానత్వం, సమ్మిళితత్వం, స్వేచ్ఛాయుతమైన, ఆర్థికంగా ఏకీకృతమైన ప్రపంచం కోసం కృషి చేయాలి. తద్వారా ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి సానుకూల శక్తిని అందించాలి. ఇరు దేశాలు ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలి" అని షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం అనంతరం ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించిన భారత్‌కు చైనా అందించిన మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. షీ జిన్‌పింగ్‌తో పలు అంశాలపై చర్చించానని వెల్లడించారు. నిర్మాణాత్మక చర్చలకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రకటించారు. "మీకు (జిన్‌పింగ్‌ను ఉద్దేశించి) హృదయపూర్వక స్వాగతం పలకడం నాకు చాలా ఆనందంగా ఉంది. బ్రిక్స్ సదస్సులో మీరు చేసిన సానుకూల వ్యాఖ్యలకు ధన్యవాదాలు. బ్రిక్స్ సమిట్‌కు అధ్యక్షత వహించిన భారత్‌కు చైనా అందించిన మద్దతు, సహకారానికి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఇప్పుడు మనకు ద్వైపాక్షిక సహకారంపై చర్చించే అవకాశం లభించింది" అని మోదీ స్పష్టం చేశారు. చివరిసారిగా 2019లో భారత్‌లో పర్యటించిన షీ జిన్‌పింగ్, మళ్లీ ఏడేళ్ల తర్వాత ఇండియా టూర్‌కు వచ్చారు. అంతకుముందు 2016, 2014 జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. అయితే, 2020లో గల్వాన్ లోయ ఘర్షణలతో భారత్- చైనా మధ్య సంబంధాలు తీవ్రంగా క్షీణించాయి. దీంతో 2019 తర్వాత భారత పర్యటనకు జిన్‌పింగ్ రాలేదు. ఏడేళ్ల తర్వాత మళ్లీ బ్రిక్స్ సదస్సు కోసం ఇండియాకు వచ్చారు.

# సౌదీ పైప్‌లైన్‌పై ఇరాక్ డ్రోన్ దాడి



రియాద్ : సౌదీ అరేబియాకు చెందిన కీలక పైప్‌లైన్‌పై ఇరాక్ డ్రోన్ల దాడి జరిపింది. ఈ దాడిలో కొందరికి గాయాలయ్యాయని, కొంత ఆస్తినష్టం సంభవించిందని సౌదీ తెలిపింది. దాడిని తీవ్రంగా ఖండించిన సౌదీ 1,200 కిలోమీటర్ల పొడవైన ఆ పైప్‌లైనును తాత్కాలికంగా మూసేసింది. దక్షిణ రాష్ట్రమైన మేసన్‌లోని ఓ ప్రాంతం నుంచి సౌదీ అరేబియా తూర్పు -- పడమర పైప్‌లైన్‌పై దాడి జరిగిన విషయాన్ని ఇరాక్ ప్రధాని కార్యాలయం ధృవీకరించింది. ఈ ఆపరేషన్‌కు నేతృత్వం వహించిన మిలిటరీ కమాండర్‌ను విధుల నుంచి తొలగించామని తెలిపింది. ఈ ఘటనపై ఇరాక్ ప్రధాని అలీ అల్ -- జైదీ విచారణకు ఆదేశించారు. కాగా పరిపాలన, భద్రతా సంబంధమైన కారణాల దృష్ట్యా సరిహద్దు క్రాసింగులను మూసివేయాలని ఇరాక్ అధికారులు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్ మద్దతుతో ఇరాక్ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న అనేక మిలిషియా గ్రూపులు తమ చమురు స్థావరాలపై దాడులు చేస్తున్నాయని సౌదీ అరేబియా చాలా కాలంగా ఆరోపిస్తోంది. హార్ముజ్‌లో వాణిజ్య నౌకల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడుతుండడంతో తూర్పు'పడమర పైప్‌లైన్ ద్వారా సౌదీ చమురు సరఫరాలు చేస్తోంది. కాగా ఇరాక్ అభ్యర్థన మేరకు ఎలాంటి ప్రతీకార దాడులకు దిగబోవడం లేదని సౌదీ తెలిపింది. అయితే దేశ సార్వభౌమత్వం, భద్రత, కీలక సదుపాయాల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకునే హక్కు తనకు ఉన్నదని స్పష్టం చేసింది.

# జాతీయ లోక్ అదాలత్‌లో 268 కేసుల పరిష్కారం

-కక్షిదారులకు రూ.1.72 కోట్లకు పైగా లబ్ధి



**నర్సాపురం, సెప్టెంబర్ 12 ( నేటి దర్శిని**
పౌరులు సత్వర న్యాయం పొందేందుకు లోక్ అదాలత్‌లు ఎంతగానో దోహదపడతాయని నర్సాపురం 10వ జిల్లా అదనపు న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నర్సాపురంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఏర్పాటు చేసిన మూడు బెంచీల ద్వారా మొత్తం 268 కేసులను పరిష్కరించారు. వీటిలో క్రిమినల్ కేసులు 70, సివిల్ కేసులు 22, ఎక్సైజ్ కేసులు 33, చెక్ బౌన్స్ కేసులు 5, మనోవర్తి కేసులు 3, బెంచ్ కోర్టు కేసులు 115, ప్రీ లిటిగేషన్ బ్యాంక్, టెలికాంకు సంబంధించిన కేసులు 12 ఉన్నాయి.ఈ కేసుల పరిష్కారం ద్వారా కక్షిదారులకు రూ.1 కోటి 72 లక్షల 4 వేల 840 రూపాయల మేర లబ్ధి చేకూరినట్లు న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ బెంచ్ న్యాయమూర్తులుగా పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ. వాసంతి, సీనియర్ సివిల్ జడ్జి జి. గంగరాజు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. రాజ్యలక్ష్మి వ్యవహరించారు. సభ్యులుగా కె. అంబిక, షర్మిల కీర్తి, కె.ఎస్. మాణిక్యాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. జ్ఞానానంద పాల్గొన్నారు. కక్షిదారుల సౌకర్యార్థం సీనియర్ న్యాయవాది కె. స్వామి నాయుడు భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ. వాసంతి తెలిపారు.

# కూటమి సమన్వయాన్ని బలోపేతం చేసి సమష్టిగా పనిచేయాలి..



**కర్నూలు రూరల్ బ్యూరో, సెప్టెంబర్ 12 ( నేటి దర్శిని**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి నూటికి నూరు శాతం విజయం సాధించడమే లక్ష్యంగా సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని కూటమి నాయకులు నిర్ణయించారు. మూడు పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులతో కూడిన ఎన్‌డీఏ కూటమి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల వ్యూహం, క్షేత్రస్థాయి కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.సమావేశానికి టీడీపీ జోన్--5 సమన్వయకర్త, స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జి పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి, జనసేన సమన్వయకర్త చిలకం మధుసూదన్‌రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు చింతా సురేష్, రేఖ గౌడ్, అర్షద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి. రామకృష్ణ పరమహంస, రాష్ట్ర నిర్మాణ కమిటీ సభ్యుడు విట్టా రమేష్ హాజరయ్యారు. ఎన్నికల నేపథ్యంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య పూర్తి స్థాయి సమన్వయం ఉండేలా కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామ, మండల స్థాయి నుంచి క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని నేతలు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఐక్యతే ప్రధాన బలంగా నిలవాలని, పరస్పర సహకారంతో ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ప్రజల మద్దతుతో స్థానిక సంస్థల్లో ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించేలా సమష్టి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. మూడు పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్టం చేసి నూటికి నూరు శాతం విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని నాయకులు వెల్లడించారు.

# రాజీ మార్గంలో సత్వరమే కేసుల పరిష్కారం

-లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి..

-జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. వాసు



**కర్నూలు, సెప్టెంబర్ 12 ( నేటి దర్శిని**
ఏళ్ల తరబడి న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గంలో, ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సత్వరమే పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ అద్భుతమైన వేదికగా నిలుస్తుందని ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి, పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. వాసు తెలిపారు. సెప్టెంబరు 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ఏర్పాట్లపై శుక్రవారం న్యాయవాదులు, పోలీసు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో వివాదాలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని పి. వాసు తెలిపారు. కేసుల పరిష్కారానికి న్యాయపరమైన ఖర్చులు, సుదీర్ఘ విచారణ భారం లేకుండా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గత కొన్ని రోజులుగా విస్తృత ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి లోక్ అదాలత్ ప్రాధాన్యాన్ని వివరించినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులతో ప్రత్యక్షంగా, వీడియో సమావేశాల ద్వారా సమీక్షలు నిర్వహించి కేసుల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు.

# ఆ ఏడు దశల వెరిఫికేషన్ ఏమైంది?

-డీఎస్సీపై ప్రభుత్వాన్ని నిలదీసిన జగన్

-మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జగన్

-ఏడు దశల తనిఖీ అంటున్నా అక్రమాలు ఎలా జరిగాయని విమర్శ

-నకిలీ ఖోఖో సర్టిఫికెట్లు, జరగని క్రీడాపోటీల అంశాలను ప్రస్తావించిన వైనం

-నియామక ప్రక్రియపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్



**తాడేపల్లి, సెప్టెంబర్ 12 ( నేటి దర్శిని**
ఏపీ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ల పరిశీలనలో ప్రభుత్వం చెబుతున్న 'ఏడు దశల వెరిఫికేషన్' ప్రక్రియపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు.
ఇన్ని దశల తనిఖీలు జరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ, అక్రమాలు వెలుగుచూడటాన్ని ఆయన ప్రశ్నించారు. ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం తేలికగా వ్యవహరిస్తోందని సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు.ఈ సందర్భంగా జగన్ కొన్ని నిర్దిష్ట ఘటనలను ఉటంకించారు. కొందరు విజేతల పేర్లు జాబితాలో గల్లంతవడం, కొన్ని సర్టిఫికెట్లు నకిలీవని స్వయంగా ఖోఖో క్రీడా సమాఖ్య అధికారులు చెప్పడం, ఒక అభ్యర్థి పేర్కొన్న క్రీడా ఈవెంట్‌ను తాము అసలు నిర్వహించలేదని నాగార్జున విశ్వవిద్యాలయం స్పష్టం చేయడం వంటి ఉదంతాలను ఆయన ప్రస్తావించారు.

**అసలు ఎక్కడ, ఏం వెరిఫికేషన్ చేశారు?**
"ఇన్ని అక్రమాలు బయటపడుతుంటే, అసలు ఎక్కడ, ఏం వెరిఫికేషన్ చేశారు?" అని జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇన్ని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నా, డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం ఎలా చెప్పగలదని ఆయన ప్రశ్నించారు. ఈ లోపాలే అక్రమాలకు ఆస్కారం కల్పించాయా అని సందేహం వ్యక్తం చేశారు. జరిగిన తప్పులకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో నెలకొన్న పరిస్థితులపై సమగ్రమైన వివరణ ఇవ్వాలని ఆయన కోరారు.
నిబంధనల ప్రకారమే నియామకాలు జరిగాయన్న ప్రభుత్వం

**కాగా, మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ** ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే ఉంది. అయితే, నిబంధనల ప్రకారమే నియామకాలు జరిగాయని, సర్టిఫికెట్ల పరిశీలన పలు దశల్లో పకడ్బందీగా నిర్వహించామని ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది.
మరోసారి చర్చనీయాంశంగా మారింది
కొన్ని ఆరోపణలపై అధికారులు మీడియా సమావేశాల్లో వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ, తాజాగా జగన్ చేసిన వ్యాఖ్యలతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం చెబుతున్న పారదర్శకతకు, ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు మధ్య డీఎస్సీ ప్రక్రియ రాజకీయ వివాదంగా కొనసాగుతోంది

# వినాయక చవితి వేడుకలకు పోలీసుల మార్గదర్శకాలు





-నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**తనకల్లు సెప్టెంబర్ 12 ( నేటి దర్శిని**
వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా జరుపుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని కదిరి రూరల్ సిఐ నాగేంద్ర, తనకల్లు ఎస్ఐ పి. దిలీప్ కుమార్ హెచ్చరించారు. తనకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో పోలీసులు పలు ముఖ్యమైన సూచనలు జారీ చేశారు.
ముఖ్యమైన నిబంధనలు అయిన
డీజేలపై నిషేధం: మండపాలు, ఊరేగింపులు నిమజ్జనంలో డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్స్ వాడటం పూర్తిగా నిషేధం. ట్రాఫిక్ ఆటంకాలు వద్దు ప్రధాన రహదారులు, కూడళ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా మండపాలు ఏర్పాటు చేయరాదు. మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడం, పాత కక్షలతో ఘర్షణలకు దిగడంపై చట్టపరమైన చర్యలు తప్పవు. ఇతర వర్గాల మనోభావాలు దెబ్బతినేలా పాటలు, నినాదాలు చేయడం మరియు సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు ప్రచారం చేయడం నేరం. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా జాగ్రత్తలు వహించాలి. నిమజ్జనం వద్ద ఈత రానివారు, పిల్లలు నీటిలోకి వెళ్లకుండా నిర్వాహకులు పర్యవేక్షించాలి. ప్రతి మండపం వద్ద శాంతిభద్రతలు, క్రమశిక్షణ కాపాడటానికి వాలంటీర్లను నియమించుకోవాలి.శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవడానికి పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని అధికారులు కోరారు.

# నందికొట్కూరులో కలకలం..

-విద్యా సంస్థల ఎదురుగానే లాడ్జి బాగోతం..

-యువతిపై అత్యాచారం ఆరోపణ

-కేసు నమోదు



**నందికొట్కూరు, సెప్టెంబర్ 12 ( నేటి దర్శిని**
నందికొట్కూరు పట్టణంలో విద్య నేర్పాల్సిన చోటే వల వేస్తున్న లాడ్జీల బాగోతం చివరకు బట్టబయలైంది. సరస్వతీ నిలయాలకు ఎదురుగానే విద్యార్థులు తిరిగే వీధిలోనే నందికొట్కూరు పట్టణంలోని ఓ లాడ్జిని అడ్డాగా చేసుకుని యువతి జీవితంతో ఆడుకున్న ఘటన పట్టణంలో పెద్ద కలకలం రేపింది.ఈ ఘటనపై బాధితురాలి లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా నందికొట్కూరు పోలీసులు ఎఫ్ఐఆర్ నంబర్ 105/2026 గా కేసు నమోదు చేశారు.
ఫిర్యాదు అందిన మరుక్షణమే నందికొట్కూరు సీఐ ఎస్. అశోక్ చురుగ్గా స్పందించారు. ఆలస్యం చేయకుండా భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) లోని అత్యాచారం బెదిరింపు దాడి సెక్షన్ల కింద కేసు పెట్టించారు. ఎఫ్ఐఆర్ లోనే ఘటనా స్థలం విద్యా సంస్థలకు ఎదురుగా ఉన్న లాడ్జి అని స్పష్టంగా పేర్కొనడం ఈ దందా ఎంత ధైర్యంగా సాగుతోందో చెబుతోంది.
నమ్మించి మోసం.. న్యాయం అడిగితే దాడి!
ఎఫ్ఐఆర్ వివరాల ప్రకారం పరిచయం పేరుతో మాయమాటలు చెప్పి బలవంతంగా నందికొట్కూరు పట్టణంలోని ఓ లాడ్జిలోకి తీసుకెళ్లి భయపెట్టి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణ ఉంది.విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేసింది.చివరకు కుటుంబ సభ్యులతో కలిసి న్యాయం అడగడానికి వెళితే, తిరిగి దాడికి పాల్పడి తీవ్ర మనోవేదనకు గురిచేసినట్లు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు.
ఒకటి కాదు.. రెండు కాదు.. ఇది వరుస తప్పిదం!
నందికొట్కూరు పట్టణంలో ఉన్న లాడ్జి బాగోతం ఇది మొదటిసారి కాదని స్థానికులు బహిరంగంగానే చెబుతున్నారు. కేవలం ఇరవై రోజుల క్రితమే ఓ లాడ్జిలో పేకాట ఆడుతూ కొందరు పట్టుపడ్డారు గుర్తింపు పత్రాలు లేకుండానే రూములు ఇవ్వడం వల్ల పగటి వేళల్లోనే విద్యార్థులను తప్పుదోవ పట్టించే కార్యకలాపాలు సాగడం ఇక్కడ నిత్యకృత్యంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యా సంస్థలకు వంద అడుగుల దూరంలో కూడా ఇలాంటి లాడ్జీలకు అనుమతులు ఎలా ఇచ్చారని ఈ లాడ్జికి ఎవరి అండదండలు ఉన్నాయని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.పట్టణంలోని విద్యా సంస్థల పరిధిలో ఉన్న లాడ్జీల రిజిస్టర్లు సీసీ కెమెరా దృశ్యాలు అనుమతి పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. నిబంధనలు పాటించని గుర్తింపు పత్రాలు లేకుండా గదులు ఇచ్చే లాడ్జీల అనుమతులు రద్దు చేసేందుకు పురపాలక శాఖకు నివేదిక పంపే యోచనలో ఉన్నట్లు సమాచారం. లాడ్జి యజమాని పాత్రపై కూడా లోతుగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.

# హైదరాబాద్‌లో టయోటా హైలక్స్ బూట్ క్యాంప్



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 ( నేటి దర్శిని )**
టయోటా ఆధ్వర్యంలో మోయినాబాద్‌లో 'ఆల్ న్యూ టయోటా హైలక్స్ బూట్ క్యాంప్'ను నిర్వహించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాహన ప్రియులకు హైలక్స్ పవర్, స్థిరత్వం, ఆఫ్‌రోడ్ సామర్థ్యాలను స్వయంగా అనుభవించే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన హర్ష టయోటా, మోదీ టయోటా, ఫార్ర్చ్యూన్ టయోటా, హెడ్‌వే టయోటా డీలర్‌షిప్‌లు పాల్గొన్నాయి. హైదరాబాద్, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వాహన ప్రియులు ప్రత్యేకంగా రూపొందించిన ఆఫ్‌రోడ్ ట్రాక్‌పై హైలక్స్ పనితీరు, నియంత్రణ, స్థిరత్వాన్ని పరీక్షించినట్లు తెలిపారు. వినియోగదారుల కోసం ఈ బూట్ క్యాంప్ సెప్టెంబర్ 12 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపిపారు.

# సంక్రాంతి బరిలో చిరంజీవి 'విశ్వంభర'..

## 'కాకా'కు గండం, మెగా ఫ్యాన్స్‌లో పెరుగుతున్న టెన్షన్!




మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రం 'విశ్వంభర' విషయంలో మరోసారి ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్నో రోజులుగా వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తున్న ఈ సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే దానిపై ఇప్పటివరకు పూర్తిస్థాయి స్పష్టత లేకుండా పోయింది. ముఖ్యంగా భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ పలుమార్లు మారినట్లు వార్తలు వచ్చాయి.అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. 'విశ్వంభర'ను వచ్చే సంక్రాంతి బరిలో దించేందుకు చిత్రబృందం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి విడుదలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, అదే సమయంలో సినిమాకు సంబంధించిన ఓటీటీ ఒప్పందం కూడా తుది దశకు చేరుకున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.చిరంజీవి, దర్శకుడు వశిష్ఠ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'విశ్వంభర'పై మొదటి నుంచీ భారీ అంచనాలు ఉన్నాయి. సోషియో ఫాంటసీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. చిరంజీవిని ఇంతకుముందెన్నడూ చూడని తరహాలో చూపించేందుకు దర్శకుడు వశిష్ఠ ప్రయత్నిస్తున్నట్లు చిత్రబృందం ఇప్పటికే పలు సందర్భాల్లో వెల్లడించింది. అయితే సినిమాలో కీలకంగా ఉండే విజువల్ ఎఫెక్ట్స్ పనులకు ఎక్కువ సమయం పడుతుండటంతో విడుదల ఆలస్యం అవుతూ వచ్చింది. ఇప్పుడు ఆ పనులు చివరి దశకు చేరుకున్నాయనే ప్రచారం నేపథ్యంలో.. సంక్రాంతి 2026 విడుదలను లక్ష్యంగా పెట్టుకున్నారనే వార్తలు మరోసారి తెరపైకి వచ్చాయి. 'విశ్వంభర'కు సంబంధించిన ఓటీటీ ఒప్పందం కూడా తుది దశలో ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. సాధారణంగా భారీ చిత్రాల ఓటీటీ హక్కుల విషయంలో విడుదల తేదీకి ముందే కీలక ఒప్పందాలు పూర్తవుతుంటాయి. ఇప్పుడు 'విశ్వంభర' విషయంలోనూ ఇదే తరహాలో చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.అయితే ఓటీటీ భాగస్వామి, ఒప్పంద విలువ వంటి వివరాలపై అధికారిక సమాచారం మాత్రం ఇంకా బయటకు రాలేదు. కాబట్టి ప్రస్తుతం వస్తున్న వార్తలను అధికారిక ప్రకటన వచ్చే వరకు ప్రచారంగానే చూడాల్సి ఉంటుంది.కాగా, ఇప్పటికే సంక్రాంతి సందర్భంగా 'కాకా'ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒకవేళ 'విశ్వంభర' కూడా సంక్రాంతి బరిలోకి వస్తే.. రెండు మెగా చిత్రాలను ఒకేసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం సాధ్యమవుతుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. లేదంటే 'కాకా'ను పండుగ రేసు నుంచి తప్పించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

# ఆసక్తికరంగా ప్రశాంత్ నీల్ కొత్త సినిమా ట్రైలర్

## రూమ్ నంబర్ '418' భయపెట్టేందుకు వచ్చేస్తోంది..




'కేజీఎఫ్', 'సలార్' వంటి భారీ యాక్షన్ చిత్రాలతో సంచలనాలు సృష్టించిన ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్న లేటెస్ట్ హారర్ థ్రిల్లర్ '418' (ది లాస్ట్ వార్నింగ్) సినిమా ట్రైలర్ తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రంతో తొలిసారిగా హారర్ జోనర్‌లోకి అడుగుపెడుతుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కీర్తన్ నడగౌడ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. 15 ఏళ్లుగా మూతపడిన ఒక రహస్య భవనం మరియు దాని వెనుక ఉన్న 'రూమ్ నంబర్ 418' చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఏమాత్రం హాస్యానికి తావు లేకుండా, పూర్తిగా భయం, ఉత్కంఠ మరియు సైకలాజికల్ టెన్షన్ ప్రధానంగా ఈ హారర్ థ్రిల్లర్‌నుఎ తెరకెక్కించినట్లు అర్థమవుతోంది. కంటెంట్ పరంగా తీవ్రత ఎక్కువగా ఉండటంతో సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల, చైత్ర ఆచార్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వెంకీ జీజీ సంగీతం అందించారు. దినేష్ దివాకర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రేక్షకులకు సరికొత్త భయానక అనుభూతిని పంచడానికి సిద్ధమవుతున్న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీ థియేటర్లలో సెప్టెంబర్ 18న గ్రాండ్‌గా విడుదల కానుంది.



క్యూట్‌స్మైల్.. అదిరిపోయే పోజులు.

# వారికోసం సమయాన్ని వృథా చేసుకోలేను



ప్రస్తుతం తల్లి కాబోతున్న అనుభూతిని ఆస్వాదించే పనిలో ఉన్నారు అగ్ర కథానాయిక సమంత రూత్‌ప్రభు. నిరంతరం మీడియా ద్వారానో.. లేక సోషల్ మీడియా ద్వారానో అభిమానులకు చేరువగా ఉండే సామ్.. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికరమైన విశేషాలను ఆమె పంచుకున్నారు. 'ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒడిదుడుకులు అప్పట్లో నన్ను కృంగదీశాయి. అనారోగ్యంతోనే 'సిటాడెల్'లో నటించాను. నేనే కావాలంటూ వారు పట్టుపట్టడం వల్ల చేయక తప్పలేదు. ఒకానొక సమయంలో పూర్తిగా నటనకు స్వస్తి పలకాలని అనుకున్నా. అయితే.. నా జీవనాధారం నటనే. వదిలేస్తే ఆదాయం ఆగిపోతుంది.సంపాదించిన డబ్బు కొన్నాళ్లకు కరిగిపోతుంది. ఏం చేయాలి? అని చాలా ఆలోచించా. దీనికి తగ్గట్టు.. వైద్యులు కూడా మరేదైనా వృత్తి చూసుకోండంటూ సలహా ఇచ్చారు. అందుకే.. ఉన్న డబ్బుతో నమ్మకం ఉన్న వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాను. వ్యాపారవేత్తగా మారాక, ఆ జీవితాన్ని కూడా బాగానే ఎంజాయ్ చేశాను' అని తెలిపారు సమంత. ఇంకా చెబుతూ "మా ఇంటి బంగారం' సినిమాకు నిర్మాతగా మాత్రమే వ్యవహరించాలనేది నా ఆలోచన. కానీ నేనే చేయాలంటూ రాజ్ బలవంతం పెట్టాడు. తన ప్రోత్సాహం వల్లే 'మా ఇంటి బంగారం'లో నటించాను. ఆ సినిమా మానసికంగా నన్ను బలపరిచింది. ఇప్పుడైతే నాలో చాలా మార్పు వచ్చింది. ఇదివరకు ప్రతిదానికీ ఫీలయ్యేదాన్ని. ఇప్పుడైతే అనవసరపు మాటల్ని పట్టించుకోవడం మానేశా. నా గురించి నెగెటివ్‌గా మాట్లాడాలని ఇతరులు ఫిక్స్ అయ్యాక, వారిని మార్చాలని ప్రయత్నించి నా టైమ్‌ని వృథా చేసుకోలేను. దానికంటే ముఖ్యమైన పనులు నాకు చాలా ఉన్నాయి' అంటూ చెప్పుకొచ్చారు సమంత.

# యూట్యూబ్‌లో దూసుకుపోతున్న 'ఇడుపుకాయితం' ఫస్ట్ సింగిల్!




టాలీవుడ్ టాలెంటెడ్ హీరో ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా ప్రాజెక్ట్ 'ఇడుపుకాయితం'. సుకుమార్ రైటింగ్స్ మరియు బన్నీ వాస్ వర్క్స్ పతాకాలపై బన్నీ వాస్, తాబితా సుకుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వంశీ రెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్నారు.తాజాగా ఈ సినిమా నుంచి 'నువ్వు సిన్నబోకే నా శ్రీలత' అంటూ సాగే ఫోక్-మెలోడీ ఫస్ట్ సింగిల్ లిరికల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి అందించిన గ్రామీణ వాతావరణాన్ని తలపించే బాణీలు ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలరాజు సాహిత్యానికి శంకర్ బాబు, మోహన భోగరాజు, సీలం పున్నమ్మ, బొల్లెపోగుల సుభద్ర తమ అద్భుతమైన గాత్రంతో ప్రాణం పోశారు. యూట్యూబ్‌లో విడుదలైన అతి తక్కువ సమయంలోనే ఈ లిరికల్ సాంగ్ లక్షలాది వ్యూస్‌తో దూసుకుపోతూ సంగీత ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటూ ట్రెండింగ్‌లో నిలిచింది.

# అందమైన ప్రేమకావ్యం



ఏగన్, శ్రీదేవి, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'హైకూ'. యువరాజ్ చిన్నసామి దర్శకుడు. విజయ్ సినిమా పతాకంపై డి.అరుళానందు, మాథ్యూ అరుళానందు నిర్మిస్తున్నారు. అక్టోబర్ 23న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల ఈ చిత్ర టీజర్‌ను హరీష్‌కల్యాణ్ లాంచ్ చేశారు. ప్రేక్షకులకు ఓ అందమైన రంగులప్రపంచంలో విహరించిన అనుభూతిని మిగిల్చే చిత్రమిదని, ప్రేమలోని సున్నితమైన భావోద్వేగాల్ని ఆవిష్కరిస్తూ పొయెటిక్ ఫీల్‌తో సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రియేష్ గురుస్వామి, సంగీతం: సిద్ధు కుమార్, దర్శకత్వం: యువరాజ్ చిన్నసామి.


Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450